సాక్షి విజయనగరం

సోమవారం। 11। డిసెంబర్। 2023



సాక్షి ప్రతిభా పరీక్షకు స్పందన

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బి, మ్యాథ్ బి ప్రతిభా పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- 8లో



పోటాపోటీగా మిస్టర్ ఆంధ్రా పోటీలు

- 8లో

వ్యాయామంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్ అన్నారు.



ఇదేం 'చీడ' బాబోయ్..!

ఆరుగాలం కష్టపడినా అన్నదాతకు కాలం కలసి రావడంలేదు. కూరగాయల రైతులకు ప్రకృతి సహకరించడం లేదు.

- 8లో

న్యూస్‌రీల్

15న కుస్తీ ఎంపిక పోటీలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో ఈ నెల 15న కుస్తీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని కుస్తీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పతివాడ లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో చిత్తూరు జిల్లాలో రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహిస్తున్నామని ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 15న ఉదయం 8 గంటలకు కొండగుంపాం గ్రామానికి చేరుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98486 20959 నంబరును సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగులను ఆర్థిక స్థితిమంతులుగా తీర్చిదిద్దాలి

- కేంద్ర విజిలెన్స్ మాజీ కమిషనర్ చౌదరి



మాట్లాడుతున్న సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ చౌదరి

కొత్తవలస : దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను సమకూర్చడంతో పాటు వారిని ఆర్థిక స్థితిమంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కేంద్ర విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి అన్నారు. మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గల శ్రీగురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 700 మందికి దుప్పట్లు, 50 మంది దివ్యాంగులకు వీల్‌చైర్స్, ట్రైసైకిళ్లు, కృత్రిమ అవయవాలు తదితర సామగ్రిని కేవీ చౌదరి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగిన రోజు మరొకరిపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని, వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. అందుకు తగ్గ సహకారం గురుదేవా చారిటబుల్ ట్రస్టు ద్వారా అందుతోందన్నారు. సాయం పొందిన వారు మరొకరికి సాయం చేసే స్థాయికి ఎదగాలని సూచించారు. ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో సేవలు అందజేస్తున్నామని తెలిపారు. సుమారు లక్షా 18 వేల మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించామన్నారు. స్టీల్ ఎక్స్ఛేంజి ఇండియా లిమిటెడ్ సీఎండీ బండి సురేష్‌కుమార్ మాట్లాడుతూ గురుదేవా ట్రస్టు సేవలు నిరుపమన్నారు. ట్రస్టుకు తమ కర్మాగారం నుంచి పూర్తిగా సహకరిస్తామన్నారు. ఓఎస్‌జీసీ మాజీ అధికారి అరుమగం, ప్రముఖ వైద్యుడు ఆనందకృష్ణ పాల్గొన్నారు.

జగనే మళ్లీ సీఎం కావాలని సంకల్ప యాత్ర

- ఆటోతో యాత్ర చేపట్టిన జగన్ వీరాభిమాని జయకుమార్



వైఎస్ జగన్ అభిమాని జయకుమార్ యాత్రకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

విజయనగరం రూరల్: సంక్షేమ ప్రదాత, అభివృద్ధి కారకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రకాశం జిల్లా నాలుగుప్పలపాడు మండలం ఈదుముడి గ్రామానికి చెందిన కావూరి జయకుమార్ ఆటోతో సంకల్ప యాత్ర చేపట్టారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి నుంచి కొద్ది రోజుల కిందట ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారం విజయనగరం చేరుకుంది. 100 రోజుల ఈ యాత్ర ఈనెల 21న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో నిర్మించిన విజయస్థూపం (పైలాన్) వద్ద ముగుస్తుందని జయకుమార్ తెలిపారు. యాత్రలో భాగంగా విజయనగరం వచ్చిన ఆయన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ శ్రేణులు ఆయనకు మద్దతు తెలిపాయి.


జాతీయస్థాయి ఖోఖో పోటీలకు జొన్నవలస విద్యార్థి



డి.యుగంధర్

విజయనగరం రూరల్: జొన్నవలస జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించాడు. గత నెల 26 నుంచి 28 వరకు గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించింది. జిల్లా జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డి.యుగంధర్ రాష్ట్ర ఖోఖో జట్టులో స్థానం సంపాదించాడు. ఈ నెల 13 నుంచి కర్ణాటక రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో యుగంధర్ రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడని పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు.

ఆడుదాం... అదర గొట్టేద్దాం



ఆడుదాం ఆంధ్రా లోగో

- ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరానికి చురుగ్గా సన్నాహాలు
- ఈ నెల 15 నుంచి 626 సచివాలయాల్లో క్రీడా పోటీలు
- 5 క్రీడాంశాల్లో 51 రోజులపాటు జరగనున్న క్రీడా సంబరం
- పోటీల నిర్వహణకు 320 క్రీడా మైదానాలు గుర్తింపు
- సచివాలయాలకు చేరుకున్న క్రీడా సామగ్రి
- ఈ నెల 13తో ముగియనున్న క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న 90 వేల మంది క్రీడాకారులు



ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల క్రీడా సామగ్రిని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డీఎస్‌డీఓ అచ్యుతరావు తదితరులు

విజయనగరం:

క్రీడలు... శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయి. వినోదాన్ని పంచుతాయి. యువతకు కొత్త ఉత్సాహాన్నిచ్చి.. పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయి. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు జిల్లా యంత్రాంగం చురుగ్గా సన్నాహాలు చేస్తోంది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ నిర్వహించని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈనెల 15 నుంచి అతిపెద్ద క్రీడా సంబరానికి శ్రీకారం చుట్టనుంది. మొత్తం 5 క్రీడాంశాల్లో 51 రోజుల పాటు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించనుండగా.. సచివాలయ స్థాయిలో నిర్వహించే పోటీలకు సంబంధించిన జట్లను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

626 సచివాలయాల్లో క్రీడా పోటీలు

రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్ల వ్యయంతో నిర్వహిస్తోన్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు విజయనగరం జిల్లాలో ఈ నెల 15 నుంచి 626 సచివాలయాలు వేదికగా ప్రారంభంకానున్నాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. వాలీబాల్ క్రీడాంశంలో ఒక జట్టులో 12 మంది, కబడ్డీ జట్టులో 12 మంది, ఖోఖో జట్టులో 15 మంది, క్రికెట్ జట్టులో 16 మంది, బ్యాడ్మింటన్ జట్టులో ఇద్దరు క్రీడాకారులు ఉండేలా మార్గదర్శకాలు జారీ చేసింది. ఈనెల 15 నుంచి జనవరి 1వ తేదీ వరకు 18 రోజుల పాటు సచివాలయ స్థాయిలోను, జనవరి 2 నుంచి 15వ తేదీ వరకు 14 రోజుల పాటు మండల స్థాయిలో, జనవరి 16 నుంచి 21వ తేదీ వరకు 6 రోజుల పాటు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 22 నుంచి 28వ తేదీ వరకు 7 రోజుల పాటు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. ఇక్కడ విజేతలకు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు పంపిస్తారు.

క్రీడా సామగ్రి, మైదానాలు సిద్ధం

ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరం నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు దాదాపు సిద్ధమయ్యాయి. పోటీల్లో తలపడే క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుండగానే... రాష్ట్ర ప్రభుత్వం పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడా సామగ్రి పంపిణీని ఇప్పటికే పూర్తి చేసింది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా విజయనగరం జిల్లాలోని 626 సచివాలయాలకు సామగ్రిని సరఫరా చేసింది. పోటీల్లో విజేతలకు ప్రదానం చేసేందుకు 240 ట్రోఫీలు సైతం జిల్లాకు చేరుకున్నాయి. క్రీడాకారులకు అందజేసేందుకు 2,736 మెడల్స్, 2,736 సర్టిఫికెట్లు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 320 మైదానాలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు గుర్తించారు. ఆయా మైదానాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

13 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు జిల్లా వ్యాప్తంగా అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నెల 13తో రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తారు. ఇప్పటి వరకు విజయనగరం జిల్లాలో 92,000 మంది 5 క్రీడాంశాల్లో ఆడేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. రానున్న 4 రోజుల్లో క్రీడాకారుల సంఖ్య లక్షకు పైగా దాటుతుందని అంచనా వేస్తున్నారు.

నగదు ప్రోత్సాహకాలు ఇలా...

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మొత్తంగా రూ.12 కోట్ల మొత్తాన్ని అందజేయనుంది. ఇందులో భాగంగా నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన మొదటి మూడు జట్లకు రూ.35వేలు, రూ.15వేలు, రూ.5వేలు, జిల్లా స్థాయి విజేతలకు రూ.60వేలు, రూ.30వేలు, రూ.10వేలు, రాష్ట్ర స్థాయిలోని మొదటి ముగ్గురు విజేతలకు రూ.5లక్షలు, రూ.3లక్షలు, రూ.2లక్షలు చొప్పున అందజేయనున్నారు. బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు నియోజకవర్గ స్థాయిలో మొదటి మొదటి మూడు విజేత జట్లకు రూ.20వేలు, రూ.10, రూ.5వేలు, జిల్లా స్థాయిలో రూ.35వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.2లక్షలు, రూ.1లక్ష, రూ.50వేలు చొప్పున బహుమతులు ప్రదానం చేస్తారు.



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు ఇచ్చిన క్రీడా సామగ్రి

అందరి సహకారంతో విజయవంతం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను అందరి సహకారంతో విజయవంతం చేసేలా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలోని 626 సచివాలయాల్లో మొదటి దశలో పోటీలు నిర్వహించిన అనంతరం మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశాం. జిల్లా స్థాయి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తాం. పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడా సామగ్రి పంపిణీ పూర్తి చేశాం.

– బి.రామ్‌గోపాల్, సీఈఓ, సెట్విజ్, విజయనగరం

అందంగా.. అంగన్‌వాడీ భవనాలు

- ఆధునికీకరణకు ప్రభుత్వం చర్యలు
- నాడు – నేడు ద్వారా పనులు

విజయనగరం ఫోర్ట్:

నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల భవనాల రూపురేఖలను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మార్చేసింది. కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా తీర్చిదిద్దింది. తాజాగా అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను నాడు-నేడు ద్వారా ఆధునికీకరించేందుకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ మేరకు ఆధునీకరించాల్సిన భవనాలను గుర్తించారు. వాటి పనులు చేపట్టడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసే పనిలో ప్రస్తుతం ఆ శాఖ అధికారులు ఉన్నారు. జిల్లాలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 786 కేంద్రాలు సొంత భవనాల్లో నడుస్తున్నాయి. 420 కేంద్రాలు సామాజిక కేంద్రాల్లో, 1293 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. సొంత, సామాజిక భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో 716 కేంద్రాలను ఆధునీకరించాలని గుర్తించారు. ఆ భవనాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోతే ఏర్పాటు చేస్తారు. మరుగుదొడ్లు పాడైతే బాగు చేస్తారు. భవనం పాడైతే అత్యంత ఆహ్లాదకరంగా, అందంగా తీర్చిదిద్దుతారు. పిల్లలను ఆకట్టుకునేందుకు పెయింటింగ్ వేస్తారు. ఇలా అంగన్‌వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దనున్నారు.



గంట్యాడ మండలం పెదవేమలి అంగన్‌వాడీ భవనం

ప్రతిపాదనలు సిద్ధం



జిల్లాలో 761 భవనాలను నాడు-నేడు కింద గుర్తించాం. వాటిని ఆధునికీకరించేందుకు ఎంత మేర నిధులు అవసరమో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

దివ్యాంగులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



దివ్యాంగులకు కుట్టుమిషన్లు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం, శ్రీ విజయదుర్గ దివ్యాంగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం కుట్టుమిషన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగ వైకల్యానికి చింతించకుండా, ఇతరులపై ఆధారపడకూడదనే లక్ష్యంతో అనేక మంది తమ పనిని, వృత్తిని ధైర్యంగా కొనసాగిస్తున్నారన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉండి వృత్తి విద్యాకోర్సులు అందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నారని తెలిపారు. దివ్యాంగుల జీవనోపాధి కోసం కుట్టుమిషన్లు అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు కొండబాబు, విజయదుర్గ దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులు, జిల్లాలోని దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో.. సేవలు మెరుగు

- సర్వజన ఆస్పత్రిపై ప్రజల్లో పెరిగిన నమ్మకం
- ఏడాదికి 3.70 లక్షల మంది వరకు వైద్య సేవలు
- ఏడాదికి 45 వేల మంది ఇన్‌పేషంట్లకు చికిత్స
- 5 లక్షలకు పైగా వైద్య పరీక్షలు
- 5 వేల వరకు మేజర్ ఆపరేషన్లు
- అన్ని విభాగాల్లో నాణ్యమైన వైద్య సేవలు

రాష్ట్రంలో వైద్య రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం ఎనలేనిది. ప్రజారోగ్యమే మహాభాగ్యం అనే భావనతో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. అవసరమైనంత మంది వైద్యులు, సిబ్బందిని నియమించారు. తద్వారా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సకాలంలో సేవలు అందించేలా చర్యలు తీసుకుంది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగింది. రోగుల తాకిడి పెరిగింది.

విజయనగరం ఫోర్ట్:

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చేశారు. ముఖ్యంగా వైద్య కళాశాల జిల్లాలో ఏర్పాటు చేయడం వల్ల సేవలు పెరగడంతో పాటు వైద్య సిబ్బంది సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. వైద్యకళాశాల ఏర్పాటు వల్ల జిల్లా ఆస్పత్రి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారింది. దీనివల్ల ఓపీ విభాగాలు కూడా పెరిగాయి. అన్నిరకాల వైద్య సేవలు అందుతుండడంతో సర్వజన ఆస్పత్రిలో వైద్యసేవల కోసం నిత్యం అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. వైద్య సేవలు కూడా సకాలంలో అందుతున్నాయి. శస్త్రచికిత్సలు కూడా సకాలంలో జరుగుతుండడంతో ఆస్పత్రిపై ప్రజల్లో నమ్మకం పెరిగింది.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

జిల్లా ఆస్పత్రిగా ఉన్నప్పుడు సివిల్ అసిస్టెంట్ సర్జన్, సివిల్ సర్జన్లు రోగులకు వైద్య సేవలు అందించేవారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారిన తర్వాత ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రోగులకు సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో సేవలు అందించడంతో కార్పొరేట్ తరహాలో చికిత్స అందుతుంది. సూపర్ స్పెషాల్టీ సేవలు మినహా అన్ని సేవలు అందుతున్నాయి. అన్ని విభాగాల్లో నలుగురు నుంచి పది మంది వరకు వైద్యులు ఉండడంతో రోగులు నిరీక్షించాల్సిన పనిలేకుండా సేవలు సంపూర్ణంగా అందుతున్నాయి.

ఏడాదికి 3.70 లక్షల మందికి సేవలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏడాదికి 3.70 లక్షల మంది వరకు రోగులకు సేవలు అందుతున్నాయి. ఇన్‌పేషంట్లు 45 వేల మందికి, మేజర్ ఆపరేషన్లు 5 వేలు, మైనర్ ఆపరేషన్లు 17 వేలు, అల్ట్రా సౌండ్ స్కాన్‌లు 20 వేలు, ఎక్సరేలు 21 వేలు, ల్యాబ్ టెస్టులు 5 లక్షలు, ప్రసవాలు 8 వేలు చేస్తున్నారు.



లేబొరేటరీలో వైద్య పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

2019 నుంచి ఇప్పటి వరకు అందించిన వైద్య సేవలు వివరాలు

సంవత్సరం	ఓపీ	ఐపీ	వైద్య పరీక్షలు
2019	3,47,651	45,632	5,05,688
2020	1,96,533	32,227	2,76,847
2021	3,23,491	38,350	4,15,143
2022	3,74711	39,918	5,97,699
2023	2,69,879	25,568	5,40,666



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఆస్పత్రి విభాగాలు

ఆస్పత్రిలో ఈఎన్‌టీ, డెంటల్, ఎస్‌సీడీ, ఏఆర్‌టీ, కంటి, చర్మవ్యాధులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పలమనాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫోరెన్సిక్, బయోకెమిస్ట్రీ వంటి విభాగాలు ఉన్నాయి. డిజిటల్ ఎక్సరే, ఈసీజీ, సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, టూడీ ఇకో సేవలు అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల వైద్య పరీక్షలు చేసే లేబొరేటరీ కూడా ఉంది. కేన్సర్ నిర్ధారణ చేసే ఎఫ్ఎన్ఏసీ పరీక్షలు కూడా జరుగుతున్నాయి. ముఖ్యంగా యూరిన్ కల్చర్, బ్లడ్ కల్చర్ వంటి ఆధునాతన వైద్య పరీక్షలు కూడా జరుగుతున్నాయి. అన్ని విభాగాలకు పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారు. రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయి.

వైద్య సేవలు విస్తృతం



గతంలో కంటే అన్నిరకాల వైద్య సేవలు పెరిగాయి. వైద్య సిబ్బంది తమ వంతు సేవలు బాగానే అందిస్తున్నారు. ఓపీ, ఐపీ, ఆపరేషన్లు ఇలా అన్ని సేవలు పెరిగాయి. ఆస్పత్రికి వచ్చిన వారికి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నాం. సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– డాక్టర్ అనిలాసునందని, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

సేవలు బాగున్నాయి..



దగ్గు, ఆయాసం వచ్చిందని సర్వజన ఆస్పత్రికి వచ్చాను. నాకు డాక్టర్ గారు పరీక్షించి, వైద్య పరీక్షలు చేయించారు. రిపోర్టులు చూసి మందులు అందజేశారు. అప్యాయంగా డాక్టర్‌గారు నాతో మాట్లాడారు.

– రాము, నడుపూరు గ్రామం, గుర్ల మండలం

ఆప్యాయంగా సేవలు



జ్వరం, దగ్గు వస్తుందని సర్వజన ఆస్పత్రికి వచ్చాను. డాక్టర్ గదికి వెళ్లగానే ఏమి ఇబ్బంది అని ఆప్యాయంగా అడిగారు. ఏమి పరవాలేదు. తగ్గిపోతుందని డాక్టర్ గారు ధైర్యం చెప్పారు.

– పైడిరాజు, విజయనగరం

క్లుప్తంగా

జాతీయ కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు




జాతీయకబడ్డీ పోటీలకు ఎంపికైన రామలక్ష్మి, భువన

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న సీనియర్స్ మహిళల కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారిణులు ఎంపిక య్యారు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరపున కె.రామలక్ష్మి, ఎం.భువన ప్రాతినిధ్యం వహించనున్నారు. గత నెలలో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల అంతర్ జిల్లాల సీనియర్స్ కబడ్డీ పోటీల్లో జిల్లా మహిళల జట్టు ప్రథమ స్థానం దక్కించుకున్న విషయం విదితమే. జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన జిలా క్రీడాకారిణులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు, కేవీ ప్రభావతిలు అభినందించారు.

బొలెరో ఢీకొని వ్యక్తికి గాయాలు



ప్రమాద దృశ్యం

కొమరాడ: మండలంలోని కూనేరు రామభద్రాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయాల పాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాయగడ నుంచి వస్తున్న బొలెరో వాహనం పార్వతీపురం నుంచి బైక్‌పై ఎదురుగా వస్తున్న చందక సింహాచలాన్ని ఢీకొట్టింది. దీంతో సింహాచలం కుడికాలు విరిగిపోయింది. ఈ విషయం గమనించిన స్థానికులు పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఆదిత్య హృదయ హోమం



యాగశాలలో హోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హవనం, ఆదిత్య హృదయ హోమం, తదితర కార్యక్రమాలను జరిపించారు. అనంతరం స్వామి సన్నిధిలో సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్తీక మాసం ఆదివారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రామక్షేత్రానికి విచ్చేశారు. పలువురు ఔత్సాహిక భక్తులు బోడికొండపైకి వెళ్లి అలనాటి చారిత్రక ఆధారాలను తిలకించారు. దీంతో బోడికొండపై సందడి వాతావరణం కనిపించింది.

సాక్షి ప్రతిభా పరీక్షకు స్పందన

- స్పెల్‌బి, మ్యాథ్ బిలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



మ్యాథ్ బి క్వార్టర్ ఫైనల్ పరీక్షలో విద్యార్థులు

SAKSHI SPELL Bee 2023-24

SAKSHI MATH BEE 2023-24



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బి సెమీఫైనల్స్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నైపుణ్యం పెరుగుదలకు దోహదం



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్ బి ప్రతిభా పరీక్ష విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంది. పాఠశాలలో చెప్పిన తరగతులకు భిన్నంగా ప్రతిభా పరీక్షలో అంశాలు ఉన్నాయి. కొత్త అంశాలు చాలా నేర్చుకున్నాను. భవిష్యత్‌లో పోటీ పరీక్షలు సునాయాసంగా రాసేందుకు ఈ పరీక్ష దోహదపడుతుంది.

ఎ.కార్తికేయ శర్మ, 8వ తరగతి విద్యార్థి

ప్రతిభ నిరూపించుకునే వేదిక



విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను నిరూపించుకునేందుకు సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బి మంచి వేదికగా నిలుస్తోంది. ముఖ్యంగా ఇంగ్లీష్ భాషలో పట్టు సాధించాలనుకునే విద్యార్థులకు ఇటువంటి పోటీ పరీక్షలు ఉపయోగపడతాయి. పరీక్షలో ఎన్నో కొత్త పదాలు, వాక్యాలు నేర్చుకున్నాం. భవిష్యత్‌లో ఎటువంటి పోటీ పరీక్షకు వెళ్లినా సులభంగా అర్థం చేసుకుని రాయగలమన్న నమ్మకం వచ్చింది.

– ఎం.హర్షిణి, 8 వ తరగతి విద్యార్థిని

విజయనగరం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బి, మ్యాథ్ బి ప్రతిభా పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నగరంలోని కామాక్షినగర్ ప్రాంతంలో గల శ్రీ చైతన్య పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రతిభా పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. ప్రెజెంటింగ్ స్పాన్సర్ డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్ ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో నిర్వహించిన పరీక్షలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభకు పదును పెట్టుకున్నారు. 1, 2 తరగతుల విద్యార్థులకు కేటగిరీ-1 విభాగంలో, 3,4 తరగతుల విద్యార్థులు కేటగిరి-2 విభాగంలో 5,6,7 తరగతుల విద్యార్థులకు కేటగిరి-3 విభాగంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు కేటగిరి-4 విభాగంలో పరీక్ష నిర్వహించారు. ఆదివారం క్వార్టర్ ఫైనల్స్ విభాగంలో నిర్వహించిన స్పెల్ బి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రీజనల్ స్థాయిలో నిర్వహించే ఫైనల్స్‌కు అర్హత సాధించనున్నారు. అదేవిధంగా సెమిఫైనల్స్‌లో విభాగంలో నిర్వహించిన మ్యాథ్ బి పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఫైనల్ పరీక్షకు ఎంపికకానున్నారు. ఈ పరీక్షలను శ్రీ చైతన్య విద్యా సంస్థల రీజనల్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జ్యోతి, డీన్ జామి చిన్న పర్యవేక్షించారు.

పోటాపోటీగా మిస్టర్ ఆంధ్రా పోటీలు



బాడీబిల్డింగ్ పోటీల్లో శరీర సౌష్టవాన్ని ప్రదర్శిస్తున్న క్రీడాకారులు

- 11 జిల్లాల నుంచి పాల్గొన్న 90 మంది క్రీడాకారులు

రాజాం సిటీ: వ్యాయామంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక జీఎంఆర్ ఐటీలో ఏపీ మిస్టర్ ఆంధ్రా ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. రాత్రి 9.30 గంటల వరకు ఈ పోటీలు జరగ్గా 11 జిల్లాల నుంచి 90 మంది క్రీడాకారులు పాల్గొని శరీర సౌష్టవాన్ని ప్రదర్శించారు. మొత్తం 8 కేటగిరీలలో నిర్వహించిన ఈ పోటీల్లో 55 కిలోల విభాగంలో ఎ.రాజేష్, జి.రాంబాబు (విజయనగరం), పి.రాజేష్ (శ్రీకాకుళం), ఎ.చిరంజీవి (తూర్పుగోదావరి), పి.మోహన్ (విజయనగరం)లు వరుస ఐదు స్థానాల్లో నిలిచారు. 60 కేజీల విభాగంలో ఈవీఎన్ కుమార్ (గుంటూరు), ఎస్‌కే అబ్దుల్ ఖాన్ (శ్రీకాకుళం), ఎస్.వంశీమోహర్(విశాఖపట్నం), జె.కల్యాణ్ (తూర్పుగోదావరి), ఆర్.హరీష్ (శ్రీకాకుళం)లు వరుస స్థానాలు దక్కించుకున్నారు. 65 కేజీల విభాగంలో కె.గౌరీశంకర్ (శ్రీకాకుళం), ఎల్.దుర్గాప్రసాద్, బి.లక్ష్మణరావు (తూర్పు గోదావరి), పి.రాజ్‌దేవ్ (శ్రీకాకుళం), ఎం.చంద్రమౌళి (విజయనగరం)లు వరుస ఐదు స్థానాల్లోను, 70 కేజీల విభాగంలో ఎం.సాయిదీపక్ (విజయనగరం), టి.మహీంద్ర (తూర్పుగోదావరి), బి.చంద్రశేఖర్, వై.వినయ్‌కుమార్, కె.అంజి (విజయనగరం)లు వరుస స్థానాలు దక్కించుకున్నారు. అలాగే 75 కేజీల విభాగంలో ఎన్.రవికుమార్ (గుంటూరు), ఎన్.భాస్కర్ (శ్రీకాకుళం), జె.రవితేజ, ఎస్.కిరణ్‌కుమార్, వి.బాలకృష్ణ(విజయనగరం)లు వరుస ఐదు స్థానాల్లో నిలిచారు. 80 కేజీల విభాగంలో ఎస్.రమేష్ (తూర్పుగోదావరి), కె.భార్గవ్‌రామ్, కె.బాలాజీ, జి.రాఘవ (విజయనగరం), జె.గణేష్ (శ్రీకాకుళం)లు వరుస స్థానాల్లో నిలిచారు. 85కేజీల విభాగంలో ఎస్.శ్రీనివాసరావు (విజయనగరం), బి.రోహిత్ (తూర్పుగోదావరి), వి.వంశీకృష్ణ (విశాఖపట్నం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. మెన్ ఫిజిక్ విభాగంలో కె.బాలాజీ(విజయనగరం), వి.మహేష్ (శ్రీకాకుళం), ఎల్.దుర్గాప్రసాద్ (తూర్పు గోదావరి), ఎస్.వంశీమోహర్(విశాఖపట్నం), ఇబ్రహీమ్ షేక్ (శ్రీకాకుళం)లు వరుస ఐదు స్థానాల్లో నిలిచారు. మాస్టర్స్ విభాగంలో బి.చంద్రశేఖర్ (విజయనగరం), షేక్ ఇనూష్ (తూర్పు గోదావరి), పి.అప్పారావు (విజయనగరం), కె.రామినాయుడు (విశాఖపట్నం), ఎ.భాస్కర్ (శ్రీకాకుళం)లు వరుస స్థానాల్లో నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌గా గుంటూరుకు చెందిన ఎన్.రవికుమార్ నిలిచారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. విజేతలకు షీల్డ్‌లతోపాటు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, సౌత్ సెంట్రల్ రైల్వే మిస్టర్ ఇండియా చాంపియన్ భాస్కరన్, ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

ఇదేం చీడ బాబోయ్..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు రామభద్రపురం గ్రామానికి చెందిన చింతల అప్పలనాయుడు. సుమారు రెండు ఎకరాలలో పొట్టి చిక్కుడు పంట సాగు చేస్తూ దాదాపు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాడు.అయితే పంట చేతికందే సమయంలో మిచాంగ్ తుఫాన్ కారణంగా తెగులు సోకి చూస్తుండగానే పంట పాడవడంతో పెట్టుబడి పోయే పరిస్థితి నెలకొందని వాపోతున్నాడు. అధికంగా పెట్టుబడులు పెట్టడంతో పాటు కుటుంబమంతా ఆరుగాలం కష్టపడినా ప్రకృతి సహకరించడంలేదని నేల రాలిన చిక్కుడు పిందెలు చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



తెగులు సోకిన చిక్కుడు పంటను దిగాలుగా చూపుతున్న రైతు

- కూరగాయ పంటలకు తెగులు, పురుగు బెడద
- వాపోతున్న రైతులు



తుఫాన్ ప్రభావంతో పూర్తిగా పాడైన చిక్కుడు పంట

నష్టపోయాం..



పది సంవత్సరాలుగా కూరగాయల పంటలు సాగు చేస్తున్నాను.అందులో ఎక్కువగా పొట్టి చిక్కుడు సాగు చేస్తాను. వాతావరణ పరిస్థితుల కారణంగా కూరగాయల పంటకు ఇంతగా తెగులు సోకడం ఇదే మొదటసారిగా చూస్తున్నాను. క్రిమి సంహారక మందులు పిచికారీ చేసినా తెగులు, పురుగులు వదల లేదు. ఎకరా విస్తీర్ణంలో చిక్కుడు సాగుకు అప్పు చేసి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. పంట చేతికొచ్చే సమయంలో మిచాంగ్ తుఫాన్ కారణంగా అధిక వర్షాలు కురిసి తెగులు బెడద ఎక్కువై పంట పాడవడంతో అప్పుల పాలవుతున్నాను.

గెద్ద జగన్నాథం, రైతు,రామభద్రపురం

రామభద్రపురం: ఆరుగాలం కష్టపడినా అన్నదాతకు కాలం కలసి రావడంలేదు. కూరగాయల రైతులకు ప్రకృతి సహకరించడంలేదు.ఖరీఫ్ సీజన్ మొదట్లో విత్తిన విత్తనం మొలకెత్తకుండా వరుణుడు ముఖం చాటేయడం, తర్వాత అధిక వర్షాలు కురవడంతో నానా అవస్థలు పడుతూ సాగునీరందించి మొక్కను బతికించుకున్నారు. పంట చేతికందే సమయంలో రెండు నెలలుగా తీవ్ర వర్షాభావం నెలకొంది. దీంతో బోరుబావులు, నేలబావులలోని నీటిని కిరోసిన్ ఇంజిన్లతో తోడి అందించారు. రైతులు అప్పులు చేసి మదుపులు పెట్టి ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేస్తే మళ్లీ పూత వచ్చి పిందె కడుతుందన్న సమయంలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వరుసగా మూడు రోజుల పాటు జోరుగా వర్షాలు కురిశాయి. దీంతో పంటలకు చీడపీడలు, వైరస్ సోకడంతో కూరగాయ పంటలు బాగా దెబ్బతిని కోతకు వచ్చిన పంటంతా పోయింది. జిల్లాలోని ఖరీఫ్,రబీ సీజన్లలో దాదాపుగా 3 వేల హెక్టార్లలో కూరగాయల పంట సాగవుతోంది. రామభద్రపురం మండలంలో 400 నుంచి 500 హెక్టార్లలో సుమారు 2000 మంది రైతులు బీర, చిక్కుడు, వంగ, టమాటో, బెండ, కాకర, క్యాబేజీ వంటి కూరగాయ పంటలు సాగుచేస్తున్నారు. అధికంగా కురిసిన వర్షాల కారణంగా కూరగాయ పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకుతుండడంతో కూరగాయల్ని పండించే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రకృతి విపత్తులకు తెగుళ్లు సోకడంతో పెట్టుబడులు సైతం కోల్పోయే పరిస్థితి నెలకొంది. అందులో భాగంగా సుమారు 500 మంది రైతులు ఆరుగాలం శ్రమించి పొట్టి చిక్కుడు 50 హెక్టార్లలో సాగుచేస్తున్నారు. ఈపంట పూత,పిందె దశలకు చేరుకున్న సమయంలో కాండం తొలుచు పురుగు, వేరుకుళ్లుతెగులు, వివిధ రకాల చీడపీడలు ఆశించి నాశనం చేస్తోంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడి విలవిలలాడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మొక్కలు ఎదుగుదల లేక, చనిపోతున్నాయి. అలాగే వేరుకుళ్లు తెగులు సోకిన మొక్కల ఆకులు వాడిపోతూ, పూత పిందె రాలిపోతూ ఉంటుందని రైతులు చెబుతున్నారు. పంట చేతికొచ్చే లోపే పాడవుతుందని వాపోతున్నారు. కొద్ది రోజుల్లో కోతకు వస్తుందనుకుంటున్న తరుణంలో పంట తెగులు, పురుగు బారిన పడడంతో ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో రాజాం విద్యార్థుల సత్తా

రాజాం సిటీ: రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో రాజాం నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు సత్తాచాటారు. ఈ నెల 8 నుంచి 10వరకు బాపట్ల జిల్లా మార్టూరులో అండర్-19 రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జట్టు తరపున రాజాం నియోజకవర్గంలోని రాజాం, సంతకవిటి, వంగర, రేగిడి మండలాలకు చెందిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలికల జట్టు గుంటూరుతో తలపడి ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. బాలుర జట్టు నాలుగవ స్థానంలో నిలిచినట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, మండవకురిటి పీడీ మండల గోవిందనాయుడు ఆదివారం తెలిపారు. వారి ప్రతిభ పట్ల షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ పాలవలస శ్రీనివాసరావు, పలువురు పీడీలు క్రీడాకారులను అభినందించారు. విజేతలు అక్కడి ఎమ్మెల్యే రావూరి సాంబశివరావు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని పీడీ వెల్లడించారు.



నిర్వాహకులనుంచి బహుమతులు అందుకుంటున్న షూటింగ్ బాల్ క్రీడాకారులు

ముగిసిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఈశ్వర్ కౌశిక్, తదితరులు

విజయనగరం రూరల్: జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో గల ఇండోర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌తో సబ్ జూనియర్స్, క్యాడెట్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. అండర్-17 విభాగంలో విజయనగరానికి చెందిన రొంగలి సుశ్రితనాయుడు బంగారు పతకం సాధించడమే కాకుండా ఈ నెలలోనే గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు అర్హత సాధించింది. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్, సీతం విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారి ప్రసాద్‌లు బహుమతులు ప్రదానం చేశారు.



జాతీయ పోటీలకు ఎంపికైన రొంగలి సుశ్రిత

పర్యాటకులతో సందడిగా పార్క్



పర్యాటక కేంద్రంలో చిన్నారుల సందడి

గరుగుబిల్లి: తోటపల్లి కుడిమట్టికట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన పర్యాటక కేంద్రాన్ని వీక్షించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పార్క్ ఆదివారం సందడిగా మారింది. పార్వతీపురం ఐటీడీఏ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పర్యాటక కేంద్రంలో ఏర్పాటుచేసిన అపురూప చిత్రాలు, ఈప్రాంత సామాజిక స్థితిగతులను తెలియజేస్తున్నాయి. విగ్రహాలు పలువురిని ఆకర్షిస్తున్నాయి. చిన్నారులు ఆడుకునేందుకు జంప్‌బాల్, ఊయల, జారుడుబల్ల ఏర్పాటుచేశారు. ఈ ప్రాంతంలో పర్యాటక కేంద్రం, తోటపల్లి భారీ నీటిపారుదల ప్రాజెక్టు, చినతిరుపతిగా పేరుగాంచిన వెంకటేశ్వర స్వామి ఆలయం ఉండడంతో ఈ ప్రాంతమంతా సందడిగా కనిపిస్తుంది. పర్యాటకులు అధికంగా సందర్శనకు రావడంతో చిరువ్యాపారులు సైతం తమ వ్యాపారాలు మెరుగ్గా ఉండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బోటుషికారు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సందర్శకులు

గణిత టాలెంట్ టెస్టులో 130 మంది విద్యార్థులు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్టు నిర్వహించారు. సిక్కోలు గణిత వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పరీక్షకు మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు అర్హత సాధించినట్లు గణితవేదిక సభ్యులు తెలిపారు. గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈపరీక్షకు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం, పొందూరు మండలాల నుంచి 130 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష అనంతరం వారందరికీ నిర్వాహకులు జ్ఞాపికలు అందించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలు రెండురోజుల్లో ప్రకటిస్తామని, ఈనెల 17న జిల్లా కేంద్రాల్లో డీఈఓల చేతులమీదుగా జిల్లా విజేతలకు బహుమతులు అందజేయనున్నామన్నారు. ఈ పరీక్షలకు సెంటర్ అబ్జర్వర్‌గా కె.హేమంత్‌కుమార్, నిర్వాహకులు గణిత వేదిక ప్రతినిధులు ఎస్.హుస్సేన్, కె.కృష్ణంరాజు, శివకుమార్‌లు వ్యవహరించగా, గణిత ఉపాధ్యాయులు వై.ఆదినారాయణ, ఎల్.గోవిందరావు, జీవీ రమణ, నాగరాజు, అప్పలరాజు, బి.సూరిబాబు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170